# మాల్దీవులు ఇండియా జోక్యం వద్దు

**ఇండియా,** మాల్దీవుల మధ్య సంబంధాలు ముఖ్యంగా యమీన్ ప్రభుత్వం అనంతరం తీవ్రంగా దెబ్బతిన్నాయి. భారత పాలకుల వ్యవహార శైలి మాల్దీవుల ప్రజలకు ఇంతకుముందూ నచ్చలేదు. వారి ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోవటం ఇష్టంలేదు. మాల్దీవుల రాజకీయ సంక్షోభంలో తలదూర్చి అధికార వివాదంలో ప్రతిపక్షం కొమ్ముకాయడంతో సంబంధాలు మరింత దిగజారాయి. ఉద్యోగార్థులకు వీసాలు, హెలికాప్టర్ల వ్యవహారం వంటి వివాదాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

2013లో భారత ప్రభుత్వం మాల్దీవులకు 2 హెలికాప్టర్లను బహూకరించింది. వాటిని ఇండియా తీరగస్తీదళం, నావికాదళం నిర్వహిస్తున్నాయి. వీటిని ఉపసంహరించుకోవాల్సిందిగా మాల్దీవుల ప్రభుత్వం ప్రస్తుతం కోరుతోంది. పోయిన ఏడాదే వాటి గడువు పూర్తయింది. అయినా కొనసాగుతూనే వున్నాయి. నావికాదళ సిబ్బంది వీసాను కూడా మరోసారి పొడిగించారు. ఇప్పటికీ 28మంది నావికా సిబ్బంది మాల్దీవుల్లోనే వున్నారు.

సుమారుగా 2 వేల ఉద్యోగ దరఖాస్తులు మాల్దీవుల్లో అనుమతి లేకుండా వున్నాయి. సత్సంబంధాలు లేకపోవడంతో తమకు అనుమతి లేదని వారు భావిస్తున్నారు. భారతదేశ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ తాము హెలికాప్టర్లను నావికాసిబ్బందిని ఉపసంహరించుకుంటున్నామని సూత్రప్రాయంగా చెప్పినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. హిందూ మహాసముద్రంలో చైనాను నివారించాలన్న అమెరికా వ్యూహానికి మద్దతుగా ఇండియా వ్యవహరించటమే ఈ సంబంధాలు బెడిసి కొట్టడానికి కారణం. మాల్దీవులకు హెలికాప్టర్లు, నావికా సిబ్బందిని ఇండియా పంపడం వ్యూహాత్మకమైన హిందూ మహాసముద్ర ప్రాంతంలో సైనిక స్థావరం ఏర్పాటు చేయటానికే. దీనికి అనుకూలమైన ప్రభుత్వం మాల్దీవుల్లో ఉన్నంత కాలం బాగానే వుంది. కాని ప్రభుత్వం మారడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. యమీన్ ప్రభుత్వం చైనాతో సత్సంబంధాలు కోరుకుంటోంది. చైనాకూడా మాల్దీవుల్లో భారీ పెట్టుబడులు పెట్టింది. మాల్దీవులు టూరిజంకు కేంద్రంగా మారింది. మౌలిక సదుపాయాల కల్పనకు, అభివృద్ధికి చైనాతో వాణిజ్య ఒప్పందం కూడా చేసుకుంది. లాము ఎటాల్ ప్రాంతంలో హెలికాప్టర్లను ఉపసంహరించాల్సిందిగా ఇండియాను మాల్దీవుల ప్రభుత్వం కోరింది. ఇక్కడ ఓ పోర్ట్ సిటీని నిర్మించాలని చైనా ఆలోచిస్తోంది. మాల్దీవుల్లో ప్రభుత్వం మారిపోవటంపై భారత పాలకుల్లో ఆందోళన ఉంది. మాల్దీవులు సార్క్ దేశం, పైగా పొరుగు దేశం అని భారత పాలకులు చెబుతున్నారు. చైనాపైన, ప్రస్తుతం మాల్దీవులు ప్రభుత్వంపైన ప్రవాసంలో వున్న మాల్దీవుల ప్రతిపక్షనేత నషీద్ దుష్ప్రచారానికి భారత్, అమెరికా వత్తాసు పలకటం బహిరంగ రహస్యమే. మాల్దీవుల్లో జోక్యం చేసుకోవలసిందిగా తనను తిరిగి అధికారంలో కూర్చోబెట్టాల్సిందిగా, నషీద్ బహిరంగంగానే భారత్, అమెరికా పాలకులను కోరుతున్నాడు. తద్వారా చైనావైపు మాల్దీవులు మొగ్గకుండా అమెరికా అవసరాలకనుగుణంగా రూపొందించ వచ్చని అంటున్నాడు.

భారత పాలకులు, సామ్రాజ్యవాదులు తెలుసు కోవలసింది ఏమిటంటే ఏదేశ ప్రజలైనా స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఉండాలనుకుంటారు. అన్య దేశాల ఆధిపత్యాన్ని అంగీకరించరు.అలాంటి ప్రయత్నాలను వారు గట్టిగా ప్రతిఘటిస్తారు. రెండోది అంతర్గత విషయాల్లో జోక్యం సహించరు. పొరుగు దేశమని లేదా సార్క్ దేశమనే సాకుతో భారతపాలకులకు అలాంటి హక్కు ఉండదు.

ఏకైక మార్గం ఏమిటంటే తక్షణం హెలికాప్టర్లను, నావికా సిబ్బందిని ఉపసంహరించుకోవటమే. మాల్దీవులను సార్వభౌమాధికార దేశంగా పరిగణించి సమానత్వంతో సాధారణ సంబంధాలు పునరుద్ధ రించటమే. మాల్దీవులలో జోక్యం చేసుకోకుండా ఉండటమే అన్ని సమస్యలకు పరిష్కారమార్గం.

ooooo